క్లుప్తంగా

ప్రజా సమస్యలను సత్వరమే పరిష్కరించాలి



మీ కోసంలో ఫిర్యాదు చేస్తున్న ఉప సర్పంచ్ రామకృష్ణ

తాళ్లపూడి(కొవ్వూరు): 'మీ కోసం- పీజీఆర్ ఎస్' కార్యక్రమంలో వచ్చిన ఫిర్యాదులను సత్వరమే పరిష్కరించడానికి చర్యలు తీసుకుంటున్నట్టు కొవ్వూరు ఆర్డీవో రాణి సుస్మిత తెలిపారు. ఈ మేరకు కొవ్వూరు ఆర్డీవో కార్యాలయంలో సోమవారం నిర్వహించిన 'పీజీఆర్ ఎస్ - మీ కోసం' వేదికలో అర్జీదారుల నుంచి వచ్చిన ఫిర్యాదులను ఆమె స్వీకరించారు. ఆర్డీవో మాట్లాడుతూ వివిధ సమ్యస్యలపై ఫిర్యాదుదారుల నుంచి 18 అర్జీలు స్వీకరించమన్నారు. డివిజన్, మండల, గ్రామ స్థాయి అధికారులు, సమర్థవంతంగా తమ పరిధిలోని సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.

ఫిర్యాదులు ఇలా..

పెద్దేవం గ్రామానికి చెంది ఉప సర్పంచ్ తోట రామకృష్ణ గ్రామంలో ఆక్రమణాలు తొలగించాలని ఆర్డీవోకు ఫిర్యాదు చేశారు. గ్రామంలోని 7వ వార్డులో పంచాయతీ నుంచి ఎటువంటి అనుమతులు లేకుండా అక్రమ నిర్మాణాలు జరుగుతున్నాయని వాటిని నిలుపుదల చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో డివిజన్ స్థాయి అధికారులు, ఇతర సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

రంగస్థల కళాకారుల ప్రోత్సాహానికి కృషి



రంగస్థల నటుడు గుమ్మడి గోపాలకృష్ణ

చాగల్లు: రంగస్థల కళాకారులను నాటకరంగం ఎల్లప్పుడూ ప్రోత్సహిస్తుందని ఆంధ్రప్రదేశ్ నాటక రంగ ఆకాడమీ అధ్యక్షుడు, నటుడు గుమ్మడి గోపాలకృష్ణ అన్నారు. చాగల్లులో తెలగా సంఘం గణపతి నవరాత్ర వేడుకల్లో సోమవారం పాల్గొనడానికి విచ్చేసిన ఆయన సినీమా దర్శకుడు వి.వి వినాయక్ నివాసంలో విలేకరులతో మాట్లాడారు. తన స్వగ్రామం కృషా జిల్లా మోదూరు గ్రామామని, తనకు దర్శకుడు వి.వి వినాయక్ కుటుంబంతో గత 30 సంవత్సరాలుగా ఎంతో అనుబంధం ఉందన్నారు. నాటకాలను ప్రదర్శించడమే కాకుండా రచన నిర్వహణ చేసినట్లు తెలిపారు. కళాకారులను, కళలను పోషించడానికి వృద్ధ కళాకారులను ఆదుకోవడానికి నాటక ఆకాడమీ ఎంతో కృషి చేస్తుందన్నారు. కళాకారునికి అభినయం, ఆకర్షణతో పాటుగా కమిట్‌మెంట్ అవసరమన్నారు. నాటక రంగంలో విశేష ప్రతిభ చూపిన వారికి నంది అవార్డులు ప్రదానం చేయడానికి ఆకాడమీ ద్వారా కృషి చేస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ గంధ్రోతు సురేంద్రకుమార్ తదితరులు పాల్గొన్నారు.

క్షయ రహిత భారత్ కోసం కృషి



వ్యాధిగ్రస్తులకు పోషకాహార కిట్లను పంపిణీ చేస్తున్న వైద్యాధికారులు

తాళ్లపూడి: టీబీ వ్యాధి బారిన పడిన రోగులు చికిత్సతో పాటు పోషకాహారం తీసుకోవాలని, కుటుంబ సభ్యులతో మెలిగినప్పుడు తగు జాగ్రత్తలు పాటించాలని మలకపల్లి పీహెచ్‌సీ వైద్యాధికారి డా. అన్నపూర్ణ తెలిపారు. ప్రధాన మంత్రి టీబీ ముక్త భారత్‌లో భాగంగా మలకపల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వద్ద సోమవారం క్షయ వ్యాధిగ్రస్తులకు 20 మందికి పోషకాహారం కిట్లను పంపిణీ చేశారు. వ్యాధి సోకిన వారికి చికిత్సకాలం 6 నెలలు క్రమం తప్పకుండా మందులు, పోషకాహారం తీసుకోవాలని సూచించారు. క్షయ వ్యాధిగ్రస్తులకు నేరుగా వారి బ్యాంకు ఖాతాలోనికి నెలకు వెయ్యి రూపాయలు చొప్పు జమ అవుతాయని వివరించారు. అనంతరం 100 మంది వ్యాధిగ్రస్తులను దత్తత తీసుకున్న శ్రీ సర్వరాయ షుగర్ లిమిటెడ్ ప్రతినిధి హెచ్ ఆర్ శ్రీధర్‌ను అభినందించారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ సుచందన, సీనియర్ ట్రీట్మెంట్ సూపర్‌వైజర్ భీ.భీమరాజు, ప్రాజెక్ట్ కోఆర్డినేటర్ వర్మ, కిరణ్, వెద్య సిబ్బంది పాల్గొన్నారు.

బైక్‌లు ఢీకొని దంపతులకు తీవ్రగాయాలు

నిడదవోలు రూరల్: మండలంలోని సమిశ్రగూడెంలో ఎదురెదురుగా వస్తున్న రెండు బైక్‌లో ఢీకొని భార్యభర్తలకు గాయాలైన ఘటనపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై ఎల్.బాలాజీ సుందర రావు సోమవారం తెలిపారు. గణపవరం మండలం జగన్నాథపురంకు చెందిన భార్యభర్తలు నఫీనాబేగం, నజీర్‌లు బైక్‌పై ఆగస్టు 30వ తేదీ శనివారం సాయంత్రం రాజమహేంద్రవరం వెళ్లి తిరిగి ఇంటికి వెళుతుండగా సమిశ్రగూడెం అన్నపూర్ణమ్మ హోటల్ వద్ద ఎదురుగా వస్తున్న బైక్ ఢీకొట్టింది. ఈ ఘటనలో భార్యభర్తలకు తీవ్రగాయాలైయ్యాయి. బాధితురాలు నఫీనాబేగం ఇచ్చిన ఫిర్యాదుపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని పోలీసులు పేర్కొన్నారు.

ఉపాధి కూలీల వేతనాలేవీ..?

- 16 వారాలుగా జమకాని మస్తర్ల సొమ్ము
- ఇబ్బందులు పడుతున్న కూలీలు
- అధికారుల జాప్యం



చెరువులో పూడికతీత పనులు చేస్తున్న కార్మికులు (ఫైల్)

నల్లజర్ల: జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం సిబ్బందికి నాలుగు నెలలుగా వేతనాలందడం లేదు. దీంతో ఆర్థికంగా ఇబ్బందులు పడుతున్నారు. 2006లో పథకం ప్రారంభమైనప్పటి నుంచి పనిచేస్తున్నా ఉద్యోగ భద్రత లేదు. పే స్కేల్ అమలు చేయడం లేదు. పే స్కేల్ విషయంలో పంచాయతీ రాజ్ శాఖ మంత్రి ఇచ్చిన హామీ కార్యరూపం దాల్చడం లేదు. ఉపాధి పనులు పారదర్శకత పెంచేందుకు ప్రభుత్వం స్పర్శ పేరిట డిజిటల్ మానిటరింగ్ వ్యవస్థను అమలులోకి తీసుకువచ్చింది. ఈ యాప్‌లో కూలీల వివరాలను నమోదు చేయడంలో జాప్యం జరుగుతుందని దీంతో వేతనాలు చెల్లింపు అలస్యమవుతుందని అధికారులు చెపుతున్నారు.

మండలంలో ఇదీ పరిస్థితి

మండలంలో 16 వేలకు పైగా జాబ్ కార్డులు ఉండగా నిత్యం వేలాది మంది పనులకు వెళ్లేవారు. ప్రస్తుతం ఆ సంఖ్య 250కి పడిపోయింది. ఉపాధి వేతనాలు ఎప్పుడు అందుతాయో అధికారులకు సైతం తెలియని పరిస్థితి నెలకొంది. వేతన బకాయిల గురించి ఉపాధి కూలీలు అధికారులను అడిగితే తాము చేయాల్సిన ప్రక్రియ పూర్తి చేశామని ప్రభుత్వం నిధులు విడుదల చేయగానే నేరుగా మీ ఖాతాలకే వస్తాయని చెబుతున్నారు. వేసవిలో సైతం పనిప్రదేశంలో కనీస సౌకర్యాలు కల్పించకపోయినా, అదనపు భత్యం అందించకపోయినా పనికి పోతే నాలుగు రూపాయిలు వస్తాయనే ఆశతో కూలీలు శ్రమకోర్చి పనులకు వెళ్లారు. అయితే నెలల తరబడి వేతనాలు చెల్లించకపోవడంతో ఉపాధి కూలీలు పనులపై ఆసక్తి కనపర్చడం లేదు. మరో వేపు ప్రభుత్వ అధికారులు వేతనాల కోసం కూలీలు ఆందోళన చెందాల్సిన అవసరం లేదని. మరికొద్ది రోజుల్లోనే నిధులు మంజూరయ్యే అవకాశం ఉందని చెబుతున్నారు.

సిబ్బంది బాధ్యతలు

ఉపాధి పనుల్లో భాగంగా ఏపీఓలు, ఈసీలు, టీఏలు క్షేత్ర సహాయకులు, ఇతర సిబ్బంది గ్రామంలో కూలీలతో పనులు చేయించాలి. మస్తర్లు నమోదు, కొలతలు వేయాలి. గ్రామ నర్సరీల నిర్వహణ, చెట్ల పెంపకం వంటివి పర్యవేక్షించాలి. గ్రామసభల్లో గుర్తించిన, రైతులు దరఖాస్తు చేసుకున్న పనులను కంప్యూటర్లులో నమోదు చేయాలి. కూలీలను గుర్తించాలి. కొలతల ప్రకారం పనులను పంచాయతీ కార్యదర్శి ఎస్ఏలు, సీనియర్ మేట్లకు అప్పగించాలి. గ్రామంలో కొలతలు సరిగా ఉన్నాయో ప్రతీవారం తనిఖీ చేయాలి. వారం చివరిలో పనుల కొలతలను మస్తర్లలో నమోదు చేయాలి. ఎంపీ పుస్తకంలో నమోదు చేసి ఇంజినీర్ కన్సల్టెన్సీకి నివేదించాలి.

వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో..

గత ప్రభుత్వంలో ప్రతి 15 రోజులకు ఒకసారి ఉపాధి కూలీలకు వేతనాలు తమ ఖాతాలలో జమ అయ్యేవి. అందుకు భిన్నంగా కూటమి ప్రభుత్వం వ్యవహరిస్తూ నాలుగు మాసాలు గడిచినా ఉపాధి వేతనాలు కూలీల ఖాతాల్లో జమ చేయడంలేదు. తమ ఖాతాల్లో వేతనాలు జమఅయ్యేయా? లేదో తెల్సుకోవడానికి కూలీలు పోస్టాఫీసు వద్దకు క్యూకడుతున్నారు.

ఆర్థిక భారం

మరోపక్క అల్పపీడన వాతావరణంతో వర్షాలు పడటంతో పనులు జరగడం లేదు. రేషన్ దుకాణల్లో బియ్యం, పంచదార తప్ప మిగతా సరుకులు ఏవీ ఉండటం లేదు. ఏ వస్తువు కొనాలన్నా అధిక ధరలు వెచ్చించి కొనుగోలు చేయాల్సిన పరిస్థితి ఏర్పడటంతో ఉపాధి కూలీలు కడుపులు నింపుకోవడానికి అవస్థలు పడుతున్నామని వాపోతున్నారు.

కుటుంబ పోషణ కష్టంగా ఉంది



మూడునెలలకు పైగా ఉపాధి పనులకు వెళ్తున్నాథ ఖాతాలలో నగదు జమకావడం లేదు.కుటుంబ పోషణ కష్టంగా ఉంది.ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి వేతనాలు వెంటనే అందజేయాలి.
– గంజి సూర్యకాంతం, ఉపాధిహామీ కూలీ

బకాయిలు విడుదల చేయాలి



చేసిన పనులకు వేతనాలు సకాలంలో జమకావడం లేదు. వేతనాలు వెంటనే చెల్లించాలి. బజార్లో సరుకులు కొనాలంటే డబ్బులు ఉంటే తప్ప సరుకులు అరువు ఇవ్వడం లేదు.ప్రతికుటుంబానికి 200రోజులు పనిదినాలు కల్పించాలి.
– తానింకి ప్రసాదరావు, ఉపాధిహామీ కూలీ

వైఎస్సార్‌కు ఘనంగా నివాళులర్పించండి

దేవరపల్లి: దివంగత ముఖ్యమంత్రి వైఎస్.రాజశేఖరరెడ్డి వర్ధంతి సందర్భంగా మంగళవారం గోపాలపురం నియోజకర్గంలోని నాలుగు మండలాల్లో కార్యక్రమాలు నిర్వహించి ఘనంగా నివాళులర్పించాలని మాజీ హోంమంత్రి, వైఎస్సార్ సీపీ నియోజకవర్గ ఇంచార్జి తానేటి వనిత పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చారు. గ్రామాల్లోని వైఎస్సార్ విగ్రహాలకు పూలమాలలు వేసి, సేవా కార్యక్రమాలు నిర్వహించాలని ఆమె నాయకులకు సూచించారు. మండల పార్టీ నాయకులు, కార్యకర్తలు, స్థానిక సంస్థల ప్రజాప్రతినిధులు, పార్టీ వివిధ విభాగాల నేతలు కార్యక్రమాల్లో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

మానవ హక్కుల కన్వీనర్ నియామకం



పోలుమాటి నానిబాబు

దేవరపల్లి: మానవ హక్కుల గోపాలపురం నియోజకవర్గం కన్వీనర్‌గా మండలంలోని లక్ష్మీపురంకు చెందిన పోలుమాటి నానిబాబు నాయమితులయ్యారు. ఈ మేరకు సోమవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ తనకు అప్పగించిన కర్తవ్యన్ని బాధ్యతగా నిర్వహిస్తు, వచ్చిన ప్రతి సమస్యను పరిశీలించి బాధితులకు తప్పకుండా న్యాయం చేస్తానని ఆయన పేర్కొన్నారు. హక్కులను భంగం కలిగితే తన దృష్టికి తీసుకురావాలని ప్రజలకు విజ్ఞప్తి చేశారు.

వైభవంగా పూజా గణపతి, కుమారస్వామి ఉత్సవాలు



వైఎస్సార్ సీపీ పట్టణ అధ్యక్షుడు సత్యనారాయణను సన్మానిస్తున్న ఉత్సవ కమిటీ సభ్యులు

నిడదవోలు: పట్టణంలోని గణేష్ చౌక్ సెంటర్లో వేంచేసియున్న పూజా గణపతి, కుమారస్వామి ఆలయం వద్ద ఆరోవ రోజు సోమవారం గణపతి నవరాత్రి ఉత్సవాలను వైభవంగా నిర్వహించారు. హైదరాబాదు నుంచి తీసుకువచ్చిన సుమారు 18 అడుగుల వినాయక విగ్రహం వద్ద భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్నారు. నిడదవోలు పరిసర ప్రాంతాల నుంచి అధిక సంఖ్యలో భక్తులు తరలి వచ్చి స్వామివారి దర్శనం చేసుకున్నారు. ఆలయం వద్ద సుమారు 40 మంది వినాయక మాల ధరించిన భక్తులు స్వామివారిని ప్రత్యేక పూజలు చేస్తున్నారు. ఆలయ కమిటీ అధ్యక్షుడు కారింకి సాయి బాబు ఆధ్వర్యంలో ఇక్కడ 103 వార్షికోత్సవ ఉత్సవాలను ఎంతో ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్నారు. ఈ సందర్భంగా సోమవారం వైఎస్సార్ సీపీ పట్టణ అధ్యక్షుడు కామిశెట్టి వెంకట సత్యనారాయణ, వైఎస్సార్ సీపీ నాయకులు పగడాల కిరణ్‌లను ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో ఘనంగా సత్కరించారు. ప్రత్యేక పూల కిరీటాలు, దుస్సాలువలతో వారు సత్కారం పొందారు. ఆలయం వద్ద భక్తుల సహకారంతో ప్రతిరోజు స్వామి వారి ప్రసాదం పంపిణీ చేస్తున్నారు. ఆలయ కమిటీ అధ్యక్షుడు సాయిబాబు మాట్లాడుతూ సినీ మ్యూజికల్ నైట్, కోలాటం, జానపద , కూచిపూడి నృత్య ప్రదర్శన, కాకినాడ వారిచే రాగ ఆలాపన సినీ మ్యూజికల్ నైట్, సత్య హరిచంద్ర నాటకం, వెరైటీ చింతామణి నాటకాలు వంటి సాంస్కృతిక కార్యక్రమాలు ఏర్పాటు చేసినట్లు ఆయన వివరించారు.

సూపర్ సిక్స్ ఏవి బాబు.?



గజ్జరంలో చంద్రబాబు మోసాలను ప్రజలకు వివరిస్తున్న తలారి వెంకట్రావు, నాయకులు

తాళ్లపూడి: ఒకవైపు ప్రజలకిచ్చిన హామీల అమలులో విఫలమైన కూటమి ప్రభుత్వం పరపతి రోజురోజుకూ తగ్గుతుంటే, దానిని కప్పిపుచ్చుకోవడానికి చంద్రబాబు పచ్చి అబద్ధాలు మాట్లాడుతున్నారని మాటాలు పక్కన పెట్టి వెంటనే సూపర్ సిక్స్ పథకాలను అమలు చేసి చూపించాలని కొవ్వూరు నియోజకవర్గ కోఆర్డినేటర్, మాజీ ఎమ్మెల్యే తలారి వెంకట్రావు అగ్రహం వ్యక్తం చేశారు. తాళ్లపూడి మండలంలోని గజ్జరంలో సోమవారం 'బాబు ష్యూరిటీ మోసం గ్యారంటీ' గ్రామ స్థాయి కార్యక్రమాన్ని నిర్వహించారు. రచ్చబండలో భాగంగా మండల నాయకులతో కలిసి గ్రామంలో చంద్రబాబు మోసాలను ప్రజలకు నేరుగా వివరించారు. సమావేశంలో తలారి మాట్లాడుతూ ఇచ్చిన మాట ప్రకారం అన్ని పథకాలు అమలు చేసిన నాయకుడు జగన్‌మోహన్ రెడ్డి అయితే, ప్రజలకు ఇచ్చిన అవే హామీలను తుంగలో తోక్కే నాయకుడు నాయకుడు చంద్రబాబు అని ఆరోపించారు. సూపర్ సిక్స్ పథకాలు అమలు చేయకుండా జగన్ పథకాలనే ఉల్టా కొట్టించి అమలు చేస్తున్నారని, ప్రజలు చంద్రబాబు వల్ల మోసపోయాం అన్ని గ్రహించి బుద్ధి చేప్పడానికి సిద్ధంగా ఉన్నారన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ జొన్నకూటి పోశిరాజు, సర్పంచ్ గండి రాంబాబు, జిల్లా యువజన విభాగం అధ్యక్షుడు కంఠమణి రమేష్‌బాబు, రాష్ట్ర ఎస్సీ సెల్‌కార్యదర్శి పిట్టా శ్రీనివాస్, జిల్లా రైతు విభాగం అధ్యక్షుడు పరిమి సోమరాజు, జిల్లా కార్యదర్శి వంబోలు పోశిబాబు, ఎంపీటీసీ గుంటు చిన్నబ్బాయి, కొవ్వూరు పట్టణ కన్వినర్ చిట్టూరి అన్నవరం, పార్టీ ముఖ్య నాయకులు తోట రామకృష్ణ, పిట్టా శ్రీనివాస్, యాళ్ల బాబురావు, కార్యకర్తలు, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

పాత పెన్షన్ విధానాన్ని అమలు చేయాలి



విజయవాడ ధర్నాకు తరలివెళ్తున్న ఉద్యోగ, ఉపాధ్యాయులు

తాళ్లపూడి: ఉద్యోగ, ఉపాధ్యాయులకు పాత పెన్షన్ విధానాన్ని అమలు చేయాలని, సీపీఎస్, జీపీడీలను రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ సోమవారం విజయవాడ ధర్నా చౌక్‌లో జరిగిన మహాధర్నాకు తాళ్లపూడి నుంచి 30 మంది ఉద్యోగ, ఉపాధ్యాయులు బస్సులో బయలుదేరి వెళ్లారు. ఈ సందర్భంగా ఏపీసీపీఎస్ జిల్లా అధ్యక్షుడు జోడాల వెంకటేశ్వరరావు మాట్లాడుతూ ఉద్యోగులకు సెప్టెంబర్ 1న బ్లాక్ డే అని పాత పెన్షన్ సాధనే తమ ధ్యేయమన్నారు. డిమాండ్‌ని సాధించే వరకు ఉద్యమాన్ని విరమించేది లేదని తెలిపారు. ఓపీఎస్ మాత్రమే ప్రకటించాలని డిమాండ్ చేశారు. యూటీఎఫ్ మండల అధ్యక్షుడు బారనాల శంకర్ మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం ఏర్పడి సంవత్సరం గడిచినా సీపీఎస్‌పై ఇంకా నిర్ణయం తీసుకోకపోవడం దారుణమని, ఉద్యోగ ఉపాధ్యాయులకు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఓపీఎస్ ప్రకటించి తీర్మానం చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో జె.లక్ష్మీపతి, రమాదేవి, మునేశ్వరరావు, రామకృష్ణ, రాము, వెంకటరమణ, ప్రసన్న కుమార్, మణికంఠ, మంజు, మౌనిక, సూర్యమనోజ్ఞ, ప్రసన్నలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

బెల్లంతో తులాభారం



అమ్మవారి సన్నిధిలో తులాభారం వేస్తున్న భక్తులు

దేవరపల్లి: గ్రామంలో వేంచేసియున్న బాలదుర్గమ్మ అమ్మవారి ఆలయ సన్నిధిలో సోమవారం ఒకే కుటుంబానికి చెందిన ముగ్గురు సభ్యులను భక్తులు బెల్లంతో తులాభారం వేశారు. వెంకటరమణ, దుర్గాభవాని దంపతులు, చంటిబిడ్డను బెల్లంతో తులాభారం వేశారు. ఆలయ కమిటీ అధ్యక్షులు సత్యనారాయణ, కామిశెట్టి దుర్గా రావు మాట్లాడుతూ అమ్మవారి సన్నిధిలో 2007లో అమ్మవారు కోలువైయ్యారని, ఇప్పటి వరకు 700 తులాభారాలు నిర్వహించినట్టు వివరించారు. పటికబెల్లం, బెల్లంతో తులాభారాలు వేసి భక్తులు మొక్కులు తీర్చుకుంటున్నట్టు వారు పేర్కొన్నారు.

భవన నిర్మాణ కార్మికులకు న్యాయం చేయాలి



త్యాజంపూడిలో ఆందోళన చేస్తున్న భవన నిర్మాణ కార్మికులు

దేవరపల్లి: ఎన్నికల్లో భాగంగా కూటమి ప్రభుత్వం భవన నిర్మాణ కార్మికులకు ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేయాలని కార్మికుల సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి ఎం.సుందరబాబు డిమాండ్ చేశారు. మండలంలోని త్యాజంపూడిలో సోమవారం సాయిరాం తాపీ వర్కర్స్ యూనియన్ సర్వసభ్య సమావేశం అయిన పర్తి శ్రీనివాసరావు అధ్యక్షతన జరిగింది. ఈ మేరకు పలువురు కార్మిక సంఘం నాయకులు మాట్లాడుతూ.. ఇచ్చిన హామీలను అమలు చేయాలని అనేక దఫాలుగా ఆందోళన చేసిన ప్రభుత్వం పట్టించుకోకపోవడం దారుణమని ఆయన మండిపడ్డారు. కార్మికులకు సంక్షేమ పథకాలు అమలు చేయకపోవడంతో ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నట్టు ఆయన వాపోయారు. ఈ నెల 15న తలపెట్టిన చలో విజయవాడ నిరసన కార్యక్రమానికి పెద్ద ఎత్తున కార్మికులు తరలివచ్చి విజయవంతం చేయాలని ఆయన కోరారు. సమావేశంలో మండల కార్యదర్శి పరపతి సోమశేఖర్, సభ్యులు, కార్మికులు పాల్గొన్నారు.

వెళ్లి రావయ్యా.. గణపయ్యా



రావూరుపాడులో 108 ప్రసాదాలతో ఏర్పాటు చేసిన నివేదన



వెలగదుర్రులో వినాయకుడిని ఊరేగిస్తున్న కుమ్మరి శాలివాహన ఉత్సవ కమిటీ



నిమజ్జన ఊరేగింపులో కాళికా, దేవతామూర్తుల వేషాలు

తాళ్లపూడి: మండల పరిధిలోని పలు గ్రామాల్లో ఐదవ రోజు ఆదివారం వినాయక నిమజ్జనాలను ఉత్సవ కమిటీ సభ్యులు, యూత్ కోలాహలంగా నిర్వహించాం వేగేశ్వరపురం కాలువ గట్టు వద్ద వినాయకుడి ఆలయం వద్ద నుంచి తీన్‌మార్ నృత్యాలతో వినాయకుడిని ఊరేగించారు. ప్రక్కిలంక, తాళ్లపూడి, పెద్దేవం, అన్నదేవరపేట తదితర గ్రామాల్లో ఏర్పాటు చేసిన విగ్రహాలను ట్రాక్టర్‌పై ఊరేగించి భక్తులు ప్రసాదాలు పంపిణీ చేస్తు గోదావరిలో నిమజ్జనం చేశారు.

రావూరుపాడులో సోమవారం వినాయకుడికి 108 ప్రసాదాలతో స్వామి వారికి మహా నివేదన చేశారు. రామాలయం వెనుక ఏర్పాటు చేసిన మండపంలోని షణ్ముఖ గణపతి ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో గ్రామస్తులు తమ ఇంటి వద్ద నుంచి ఒక్కో ప్రసాదాన్ని స్వయంగా తయారు చేసి తీసుకుని వచ్చి బొజ్జ గణపయ్యకు సమర్పించారు. ఉత్సవ కమిటీ సభ్యులు, యూత్, మహిళలు పాల్గొన్నారు. అన్నదేవరపేటలోని జగనన్న కాలనీ వద్ద ఏర్పాటు చేసిన అన్నసమాధనలో సుమారు 3 వేల మంది పాల్గొన్నారు.

ఘనంగా గణనాథుల నిమజ్జనం

దేవరపల్లి: వినాయక చవితి ఉత్సహాల సందర్భంగా పూజలు అందుకున్న గణనాథులకు బైబై గణేష అంటూ యువత ఘనంగా వీడ్కోలు పలుకుతున్నారు. మూడు, ఐదు రోజులు పూజలు నిర్వహించి పలు గ్రామాల్లో గణేష్ విగ్రహాలను ప్రత్యేకంగా అలంకరించిన ట్రాక్టర్లపై ఉంచి పురవీధుల్లో బ్యాండ్ మేళాలు, తీన్ మార్ డప్పులతో భారీ ఎత్తున బాణాసంచా కాల్చుతూ భక్తులు నదులు, కాలువలు, చెరువుల్లో నిమజ్జనం చేస్తున్నారు. సోమవారం దేవరపల్లి మండలంలోని పలు గ్రామాల్లో గణేష్ విగ్రహాలను నిమజ్జనం చేశారు. స్థానిక సీబీఎన్ కాలనీలోని వరసిద్ధి వినాయకుడి ఆలయం వద్ద ఏర్పాటు చేసిన విగ్రహన్ని ఊరేగింపుగా తీసుకువెళ్లి గ్రామ శివారున తాడిపూడి ఎత్తిపోతల పథకం కాలువలో నిమజ్జనం చేశారు. మెరకవీధి వినియకుడి ఆలయం వద్ద లక్ష్మీగణపతి హోమం నిర్వహించారు. నిమజ్జనం సమయంలో ఎటువంటి ప్రమాదాలు జరగకుండా పోలీస్ అధికారులు భద్రత చర్యలు చేపట్టారు.

వైభవంగా నిమజ్జనోత్సవాలు

నిడదవోలు రూరల్: వినాయక చవితిని పురస్కరించుకుని ప్రతిష్టించిన గణనాథుల నిమజ్జనోత్సవాలు నిడదవోలు మండలంలోని ఆయా గ్రామాల్లో సోమవారం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఆరు రోజులుగా పూజలందుకున్న గణనాథులను సమిశ్రగూడెం, తాడిమళ్ల, పందలపర్రు, పెండ్యాల గ్రామాల్లో ఊరేగించారు. అనంతరం కోలాహలంగా విగ్రహాలను నిమజ్జనాలు చేశారు. ఉండ్రాజవరం మండలంలోని పలు గ్రామాల్లో వినాయకుడి నిమజ్జనాలు జరిగాయి. వెలగదుర్రులో కుమ్మరి శాలివాహన సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో గణనాథుడిని ప్రత్యేకంగా అలంకరించిన వాహనంలో గ్రామోత్సవం నిర్వహించారు.

అలరించిన సాంస్కృతిక కార్యక్రమాలు

చాగల్లు: గణపతి నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా సోమవారం పలు గ్రామాల్లో ఊరేగింపులు, నిమజ్జన కార్యక్రమాలు ఘనంగా నిర్వహించారు. చాగల్లు, ఊనగట్ల పలు చోట్ల ఏర్పాటు చేసిన వినాయక విగ్రహాలను వాహనాలపై గ్రామ పురవీధుల్లో ఊరేగించారు. బుట్టబొమ్మలు, డప్పు వాయిద్యాలు, కాళిక నృత్య ప్రదర్శన, సన్నాయిమేళం, తీన్ మార్ నృత్యాలతో ఊరేగింపు సాగింది. అనంతరం స్వామి వారిని నిమజ్జనం చేశారు. చిక్కాల, మార్కొండపాడు గ్రామాల్లో విఘ్నేశ్వరుడుని గ్రామ పురవీధుల గుండా వైభవంగా ఊరేగించారు. పరిసర ప్రాంతాల భక్తులు పాల్గొన్నారు.